www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023
5
అన్నమయ్య

నాడు-నేడు పనులు పరిశీలించిన జడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

రాజంపేట మండలం ఆకేపాడు గ్రామ పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అయన సోదరుడు ఆకేపాటి మురళిరెడ్డిని పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాఘవేంద్ర, అనాల మధు, సానిపాయ జీవి రమణ పాల్గొన్నారు.

పనులు పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి

'సైక్రియాటిక్' ఖాళీలకు గ్రీన్‌సిగ్నల్

కేబినెట్‌లో 116 పోస్టుల భర్తీకి ఆమోదం
200 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్
రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన సైక్రియాటిక్ వైద్య కళాశాలలోని 116 ఖాళీల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ లభించింది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదం లభించింది. 2019 డిసెంబర్ 23, 24, 25వ తేదీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రిమ్స్ ఆవరణంలో రూ.272 కోట్లతో కూడిన సూపర్‌స్పెషాలిటీ, కేన్సర్‌కేర్, సైక్రియాటివ్ విబాగాలకు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. మరో నెల రోజుల వ్యవధిలో రూ.40.81 కోట్ల వ్యయంతో కూడిన సైక్రియాటిక్ భవన నిర్మాణ పనుల్ని పూర్తి చేసుకోబోతున్న సమయంలో పెద్దఎత్తున పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ముదావహం. రాష్ట్ర వ్యాప్తంగా 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరేజేషన్‌కు ఆమోదం తెలిపిన నేపథ్యంలో కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులరైజేషన్ పరిధిలోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లాలోని 1100 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో 100 మంది, అన్నమయ్య జిల్లాలో 800 మంది కాంట్రాక్టు ఉద్యోగుల్లో సుమారు 100 మంది వెరసి 200 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నట్లు సమాచారం. 2014 సంవత్సరంలో ఆప్కోస్, కార్యాలయ, వ్యక్తిగత ప్రాతిపదికన పెద్ద ఎత్తున కాంట్రాక్టు ఉద్యోగుల నియామకాలు చేసిన సంగతి తెలిసిందే. వీరిలో నేటికి పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేసినట్లు తెలుస్తోంది. ఈలెక్కన కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ పరిధిలోకి వచ్చే వారి వివరాలను పరిశీలిస్తే 200 మందికి మించి ఉండే అవకాశం లేదని తెలుస్తోంది. ఇదిలాఉండగా జిల్లాలోని బిసి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలకు చెందిన పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా అత్యధికంగా లెక్షరర్లు, ఇంజినీరింగ్ విభా గాలకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

జలం ఒడిసి పడితేనే ప్రతిఫలం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జలం ఒడిసి పడితేనే ప్రతిఫలమని కలెక్టర్ గిరీషా పిఎస్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేపట్టిన కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు చేస్తున్న జల శక్తి అభియాన్ ద్వారా నీటి వనరుల సేకరణ, వాటర్ మేనేజ్మెంట్ సిస్టం, డ్రిప్ ఇరిగేషన్, వాటర్ కన్జర్వేషన్, ఫారం పాండ్‌లు, చెరువులు, చెక్‌డ్యామ్‌లు, అమృత్ సరోవర పథకం, నీటి ఆధారిత వ్యవసాయం, హార్టికల్చర్, నీటిపారుదల, నీటి నిర్వహణ తదితర జిల్లాలోని ప్రధాన కార్యక్రమాలపై కలెక్టర్ జలశక్తి అభియాన్ సెంట్రల్ టీమ్‌కు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. చెరువులు, డ్రిప్ ఇరిగేషన్ సిస్టం, చెరువు పునరుద్ధరణ, పైప్‌లైన్ పనులు నాణ్యత, నిధులు మంజూరు, జల్ శక్తి అభియాన్ కింద వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాలను పెంచడం ద్వారా వర్షపు నీటిని సంరక్షించే చర్యలను అమలు తదితర వాటిపై జిల్లా ఉన్నత అధికారులు కేంద్ర బృంద సభ్యులకు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు రోజులు జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటన చేస్తుందని, వారికి పూర్తి సహకారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అడుగంటిపోతున్న భూగర్భ జలాలను మెరుగుపరిచేందుకు అన్ని శాఖలు మరింత సమిష్టిగా కృషి చేయాలన్నారు. నీటి సంరక్షణ పెంపకం కోసం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జగనన్న కాలనీలలో ఒకటి చొప్పున సోక్ పిట్ నిర్మించాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే వర్షపు నీళ్లు బోరువేల్‌కు పోయేటట్లు చూడాలన్నారు. నీటిని కాపాడి రాబోయే రోజుల్లో నీటి సమస్య లేకుండా వర్షాకాలం నీటిని భూమిలో ఇంకిపోయేలా చూడాల్సిన బాధ్యత అందరిపై కలదన్నారు. జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్‌కిచి, కేంద్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్ బోర్డు సైంటిస్ట్ అతర్వా పవార్ మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపుదలకు వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి నీటి బొట్టు ఎంతో అమూల్యమైందని, వర్షపు నీటిని కాపాడుకుంటూ మున్ముందు నీటికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని తెలిపారు. నీటిని సమృద్ధిగా కాపాడాలని దీనికి అధికారులందరూ సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. రాబోయే తరాలకు నీటిని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సమీక్షలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్మెంట్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ శాఖ జిల్లా అధికారి కృష్ణమూర్తి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

రాజంపేట అర్బన్ : ఉపాధి హామీ పనితీరు బేశుగ్గా ఉందని జలశక్తి అభియాన్ సిఎన్ఇ ప్రకాష్ తెలిపారు. బుధవారం భువనగిరిపల్లె కొండపైన కేంద్ర ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న మొక్కల పెంపకాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో అతి తక్కువ ఖర్చుతో భేషుగ్గా మొక్కలు పెంచడం అభినందనీయమని ప్రశంశించారు. జరిగిన పనులపై సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో జలశక్తి అభియాన్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, ఇజిఎస్ జాయింట్ కమిషనర్ పవార్, రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్, పీడీ మద్దిలేటి, ఎపిడి ప్రతాప్, ఎంపిడిఒ రాధాకృష్ణ, జెఇ నరసింహులు, ఇన్‌ఛార్జి ఎపిఒ మురళి, ఊటుకూరు సర్పంచ్ పల్లెపాగు ఈశ్వరయ్య, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్, ఆలయ కమిటీ సభ్యులు కె.ఎస్ నరసింహ, టిఎ శోభ పాల్గొన్నారు.

'సీమ' ప్రజల కష్టాలను తీరుస్తా

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం
హార్టికల్చర్ హబ్‌గా రాయలసీమ
'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక' విడుదలలో నారా లోకేష్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

రాయలసీమ ప్రజల కష్టాలను చూశానని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వారి కష్టాలను తీరుస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 119 రోజుకు చేరుకుంది. బుధవారం రాత్రి కడప శివారులోని ఓ ప్రయివేట్ కల్యాణ మండపం వద్ద మిషన్ రాయలసీమ పేరుతో అభివృద్ధి ప్రణాళిక విడుదల కార్యక్రమం నిర్వహంచారు. రాయలసీమలోని పార్లమెంటు నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళిక తీరుతెన్నులపై మనోగతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. రాయల సీమ జిల్లాల పరిసరాలకు అనుగుణంగా పెట్టుబడులను పరిశ్రమలను పెద్దఎత్తున తెస్తామని తెలిపారు. రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. రైతులు పంటల సాగుకు పెట్టుబడులు తగ్గించి, గిట్టుబాటు ధరలు కల్పిస్తామని పేర్కొన్నారు. స్పోర్ట్స్ యూనివర్శిటీ, మైనింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామన్నారు. కర్నూలు నుంచి గుంటూరు వరకు వెళ్తున్న వలస కూలీల వెతలను నివారిస్తామని చెప్పారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మూడవ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం రెండవ స్థానంలో నిలవడానికి వైసిపి చేతగాని పాలనే కారణమని విమర్శించారు. రాష్ట్రంలోని భూ ఆక్రమణలపై సిట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వైసిపి నాయ కులు టిడిపి నాయకులపై పెట్టిన అక్రమ కేసులను తిరగదోడతా మని హెచ్చరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో వైసిపి తరహా 49 అసెంబ్లీ సీట్ల మెజార్టీనిస్తే మిషన్ రాయలసీమ అభివృద్ధి బాద్యత తీసుకుంటానని తెలిపారు. టిడిపి హయాంలో రూ.22 వేల కోట్లతో చేపట్టిన వాటర్‌గ్రిడ్‌ను మూలన పడేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందిస్తామని తెలిపారు. బాదుడే బాదుడు తరహాలో పెంచిన పెట్రోల్ డీజిల్, ఇంటి పన్ను, చెత్త పన్ను లను తగ్గిస్తామన్నారు. వైసిపి ఎన్నికల ప్రచారంలో రైతుభరోసా పథ కం కింద రూ. 12,500 ఇస్తామని హామీనిచ్చి రూ.7,500 ఇస్తోం దని విమర్శించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే పగుల గొట్టాలన్నారు. అటువంటి వారి పక్షాన టిడిపి నిలుస్తుందని చెప్పా రు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ రూ.20 వేలు ఇస్తా మని తెలిపారు. రాష్ట్రంలో మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. మైనార్టీలైన అబ్దుల్‌సలాం మొ దలు కుని హాజీరాబేగం, మిస్బా వంటి మహిళలపై దాడులు కొనసాగు తున్నాయని తెలిపారు. రాయలసీమలో పరిశ్రమల ఏర్పాటు, ఉద్యో గాల కల్పనే 'మిషన్ రాయలసీమ అభివృద్ధి ప్రణాళిక' లక్ష్యమని ప్రక టించారు. కార్యక్రమంలో రాయలసీమలోని టిడిపి ఇన్‌ఛార్జిలు పరి టాల శ్రీరామ్, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌చౌదరి, గౌరు వెం కటరెడ్డి, అమరనాధరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమీర్‌బాబు, కస్తూరి విశ్వ నాథనాయుడు, బిటెక్ రవి, విజయమ్మ, ఉక్కు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భూపేష్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నారా లోకేష్

కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

2014, జూన్ 2 నాటికి ఐదేళ్లు నిండిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ కేబినెట్ నిర్ణయం వేలాది మంది ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసిందని, అందరినీ రెగ్యులర్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తేవడాన్ని గతంలోనే అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించాయని పేర్కొన్నారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని వారి డిమాండ్ అన్నారు. దానికి బదులుగా ఉద్యోగులపై బలవంతంగా జిపిఎస్ ను రుద్దడం సరికాదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు, యూనివర్సిటీలలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేస్తామని వైసిపి 2019 ఎన్నికల ప్రణాళికలో వాగ్దానం చేసిందని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తానన్న హామీని కూడా వెంటనే అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నారని చెప్పారు. సర్వీసును పరిగణించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. 25 ఏళ్లుగాగా పని చేస్తున్న ట్కెం స్కేల్, ఎన్ఎంఆం, డైలీవేజ్, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 60 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరిని సకాలంలో రెగ్యులరైజ్ చేయకపోవడం వలన కొంతమంది ఇటీవల కాలంలో రిట్కెర్ అవుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం నిబంధన వల్ల 7 నుంచి 8 వేల మంది మాత్రమే రెగ్యులర్ అవుతారని తెలిపారు. ఎన్నికల సమయంలో, మేనిఫెస్టోలో కాంట్రాక్టు ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేస్తామని వైసిపి ప్రభుత్వం హామీకి భిన్నంగా నేటి కేబినెట్ నిర్ణయం ఉందన్నారు. సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా పోకుండా ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపాలని కోరారు.

బోరును ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు రాంప్రసాద్‌రెడ్డి

'మండిపల్లి' సొంత నిధులతో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- చిన్నమండెం

మండలంలోని కలిబండ గ్రామస్తుల విన్నపం మేరకు స్పందించిన టిడిపి నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తన సొంత నిధులతో బోరు ఏర్పాటు చేశారు. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఆయనకు స్థానికులు తాగునీటి సమస్యను వివరించారు. తన సొంత నిధులతో బోరు వేయించడమేగాక నీటి సరఫరాకు అవసరమైన పైప్ లైన్‌కు కూడా నిధులను సమకూరుస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నాగిరెడ్డి చూపించిన బాటలో నడుస్తూ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేసుకోవడం తనకు ఎంతో ఆనందమన్నారు. కార్యక్రమంలో మండిపల్లి అభిమానులు, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

చెరువులకు మహర్దశ

గాలివీడు : మండలంలోని నాగులు చెరువులకు అమృత సరోవర్ కింద మహర్దశ కల్గనుందని ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. చెరువులు, పెద్ద చెరువులో తొలగిస్తున్న మట్టి, వ్యర్థాల తొలగింపు పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో నాలుగు చెరువులను పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టామని చెప్పారు. అరవీడు, కొర్లకుంట, తూపల్లిల్లో ఉపాధి ద్వారా బ్యూటీఫికేషన్ పనులను చేపడుతున్నామని తెలిపారు. గాలివీడు గేటు నుంచి కుమ్మరిపల్లి వరకు ఉన్న పెద్ద చెరువు కట్టపై రోడ్డు ఇరువైపులా దట్టంగా చెట్లు, గడ్డి పెరిగిపోవడంతో ఎదురు వచ్చే వాహనం కూడా కనిపించకుండా పోవడంతో బ్యూటీఫికేషన్ పనులు చేపట్టామన్నారు. ప్రతి గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

సంక్షేమ పథకాల సారధి జగన్ : 'చింతల'

కలికిరి: సంక్షేమ పథకాల సారధి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లూరు గ్రామ పంచాయతీ కస్పాలో బుధవారం ఆయన గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకూ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో అక్కడక్కడ పరిష్కారం చేశారు. ముఖ్యంగా వికలాంగుల పెన్షన్‌పై నిర్లక్ష్య వైఖరి విడనాడాలని సంబంధిత అధికారులకు హెచ్చరించారు. సచివాలయానికి వచ్చే ప్రజా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి హెచ్చరించారు. పారిశుధ్య కార్యక్రమాలు మురికినీటి కాలువలపై అధికారుల నిర్లక్ష్యం వీడి తక్షణమే పరిష్కార మార్గం చూపాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలలో ఏ పథకానికీ అర్హుల ప్రక్రియలో ఎటువంటి అవకథవకలు జరగకూడదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకం అందజేయాలని కోరారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై ఇస్తున్నటువంటి వేరుశనగ విత్తనాల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. మన ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేసిందని వ్యవసాయ రంగానికి అన్ని విధాల ప్రభుత్వ ఆదుకుంటుందని ఈ కార్యక్రమాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, ఎంపిపి వేంపల్లి నూర్జహాన్, జడ్‌పిటిసి పద్మజ లోకవర్ధన్, కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి వి.హరి, మైనార్టీ సీనియర్ నాయకుడు జుబేర్ అహ్మద్, ఎంపిడిఒ గంగయ్య, తహశీల్దార్ భాగ్యలత, మైనార్టీ యువ నాయకులు వేంపల్లి ఫయాజ్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి ప్రసాద్, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

'రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ'

రాయచోటి: రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు గ్యారెంటీ అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి అన్నారు.బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ తొలి ఏజెండాలో మహిళలకు, రైతులకు, యువతకు, వెనుకబడిన తరగతుల బలోపేతంతో పాటు ఇతర సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పేదలను ధనికులుగా తీర్చిదిద్దడానికి చంద్రబాబు నాయుడు తొలి ఏ జండా ప్రకటించారని చెప్పారు. దీనిపై ఈ నెల 9న శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు రాయచోటి పట్టణంలోని బోస్ నగర్ పోస్ట్ ఆఫీస్ సమీపంలో ఉన్న నూతన తెలుగుదేశం పార్టీ భవన్ లో నియోజకవర్గ స్థాయి చర్చా వేదిక ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు,ని యోజకవర్గ స్థాయి నాయకులు, మాజీ జడ్‌పిటిసిలు, మండల టిడిపి అధ్యక్షులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు యూనిట్ ఇన్‌ఛార్జులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, పెమ్మాడపల్లె సర్పంచ్ పల్లపు వాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ కలీమ్

ఉర్దూ భాషాభివృద్ధే ధ్యేయం

- ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఉర్దూ సాహిత్యం, భాషాభివృద్ధే తమ ధ్యేయమని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. వాల్మీకిపురం పట్టణం నాయక్‌వీధికి చెందిన అబ్దుల్ కలీమ్ బుధవారం విజయవాడలోని ఉర్దూ అకాడమీ ప్రధాన కార్యాలయంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, డైరెక్టర్ సెక్రటరీ అయ్యూబ్ హుస్సేన్ ఆధ్వర్యంలో డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలీమ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి, మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపు తున్నారన్నారు. ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు, గ్రంథా లయాల సేవలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఉర్దూ, తెలుగు భాషలు ఎంతో మధురమైనవని, భాషలకు కులాలు, మతాలతో సంబం ధం ఉండదన్నారు. భాష ఏదైనా దానిని ప్రేమించాలని, భాషపై పట్టు సాధించినప్పుడు దాని మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు వీలు కలుగుతుందన్నారు. రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉర్దూ చదివే పిల్లలకు సాంకేతిక కోర్సులలో శిక్షణ ఇచ్చేందుకు ఉర్దూ అకాడమీతో ఎంఓయూ చేసుకోవడం అకాడమీ సాధించిన గొప్ప విజయమన్నారు. ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌గా తన నియామకానికి సహకరించిన రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు దిల్షాద్ నజరానా, ముర్తుజా వలీ, డైరెక్టర్లు అబ్దుల్ షుకుర్, ఆబిదా బేగం, బాజీవలి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

రామాపురం: లయన్స్ క్లబ్ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మండల వైద్యాధికారి విజయకుమార్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ మెడికల్ స్టోర్ అధినేత వినోద్ కుమార్ ఆర్థిక సౌజన్యంతో బుధవారం రామాపురం మండల ప్రభుత్వాస్పత్రికి గ్యాస్ ట్రబుల్‌కు సంబంధించిన సిరప్‌లను అందజేశారు. ఆ సందర్భంగా అధ్యక్షులు లయన్ షేక్ మహమ్మద్ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం గొప్ప వరమని, ప్రతి ఒక్కరూ సమాజసేవకు పాటుపడాలని పేర్కొన్నారు మండల వైద్యాధికారి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వారు గతంలో ఆస్పత్రికి పలు రకాల సేవా కార్యక్రమలు చేపట్టారని చెప్పారు. ప్రస్తుతం వినోద్ కుమార్ ఆర్థిక సౌజన్యంతో గ్యాస్ ట్రబుల్‌కు సంబంధించిన సిరప్‌లను అందజేయడం సంతోషకరమన్నారు. రాబోయే రోజులలోతమ ఆసుపత్రికి అవసరమగు తగు సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి.హరీష్ చంద్, లయన్ ఉప్పు వెంకట చలపతి, ఫార్మసిస్ట్ పార్వతి, స్టాఫ్ నర్స్ శంషాద్ బేగం, అనూష పాల్గొన్నారు.

నేడు ఎంపిపి ఎన్నికపై ఓటింగ్

ప్రజాశక్తి-గాలివీడు

ఎంపిపి ఎన్నికపై గురువారం 11 గంటలకు స్థానిక ఎంపిడిఒ సభా భవనంలో మండల ప్రాదేశిక సభ్యుల అంగీకారంతో ఓటింగ్ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు మండలంలోని ఎంపిటిసి సభ్యులు హాజరై ఎంపిపి అభ్యర్థిని బలపరచడానికి ఓటింగ్‌కు సహకారం అందిస్తారన్నారు.

తహశీల్దార్‌గా రవి

సుండుపల్లి : మండల తహశీల్దార్‌గా రవి నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న మహబూబ్‌చాంద్ అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగించాలి

సుండుపల్లె : రాయవరం పంచాయతీలోని కుడుముపల్లె సమీపంలో ఉన్న పశువుల ఆస్పత్రిలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయని వెంటనే తొలగించాలని స్థానికులు అధికారులను కోరారు. పశువుల ఆస్పత్రిలో మూగ జీవాల కోసం వైద్యం పాడిరైతులు వస్తుంటారని, విషపురుగుల సంచారం అధికంగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పైగా పశువుల ఆస్పత్రి దెబ్బతిందని, ఉన్నతాధికారులు స్పందించి మరమ్మతులు చేయాలన్నారు.

వేసవి శిబిరంతో విజ్ఞానం.. వినోదం

గాలివీడు : ప్రతి ఏడాది వేసవిలో శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని లైబ్రరీయన్ రామచంద్రానాయక్ పేర్కొన్నారు. ఈనెల 11 వరకు వేసవి శిబిరం ఉంటుందన్నారు. బుధవారం సలాది వారిపల్లె ప్రాథమిక పాఠశాలలో వేసవి వినోద శిబిరంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహకంగా పాల్గొన్నారు. పిల్లలు ఆటపాటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి : గిరీష

ప్రజాశక్తి- రాయచోటి

యువతీ, యువకులు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఉపాధి పొంది తమ కుటుంబానికి ఆసరాగా నిలవాలని కలెక్టర్ గిరీష తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాయచోటిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో 30 మంది నిరుద్యోగ యువతీ, యువకులకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చారు. మూడు నెలల శిక్షణ కాలంలో 45 రోజుల పాటు క్లాస్ రూమ్ తరగతులు నిర్వహించగా మిగిలిన 45 రోజుల పాటు రాయచోటి లోని ప్రభుత్వాస్పత్రిలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయి సందర్భంగా బుధవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లోశిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ, యువకులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం చూడకుండా సాంకేతిక విద్య ద్వారా ఉపాధి పొందేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందికి హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో నెలకు రూ.18 వేల జీతంతో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ పొందిన వారు మాట్లాడుతూ జిల్లాలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి ఎంతో మంది నిరుద్యోగ యువతీ , యువకులకు నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న కలెక్టర్‌కు ఈ సందర్భంగా కృజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, డిఆర్‌డిఎ సత్యనారాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ గణేష్ పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగులతో కలెక్టర్ గిరీష



ఎడి సురేంద్రనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

అంతరాయంలేని విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అంతరాయంలేని మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ డిబిఎన్ పల్లె గ్రామస్తులు బుధవారం ఎపిఎస్‌పిడిసిఎల్ ఎడి సురేంద్రనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. బుధవారం విద్యుత్ సమస్యపై డిబిఎన్ పల్లె ప్రజలు పెద్ద ఎత్తున డిఇ కార్యాలయానికి చేరుకొని డిఇ చంద్రశేఖర్‌రెడ్డి సూచన మేరకు ఎడి సురేంద్రనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామం సబ్ స్టేషన్ కు పక్కనే ఉన్నా నిరంతరం విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గత కొంతకాలంగా కోతలు మరింత తీవ్రమయ్యాయని., పగలు, రాత్రి అన్న తేడా లేకుండా అప్రకటిత కోతలు అధికమయ్యాయని తెలిపారు. మూడు రోజులుగా నిద్ర లేని రాత్రిళ్ళు గడిపామని, తమ గ్రామానికి అతి సమీపంలోనే పట్టణ విద్యుత్ సరఫరా ఉందని.. అక్కడి నుంచి తమ గ్రామానికి తేలికగా పట్టణ విద్యుత్తు సరఫరా సౌకర్యం కల్పించవచ్చని డిఇ, ఎడిలను కోరినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎం.నరసింహులు, టి.హరికృష్ణ, టి.పెద్ద నరసింహులు, బి.సుధాకర్, నాగభూషణం, వెంకటయ్య, నరసింహ పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సాయంత్రం 4.00 గంటలకు సిద్ధవటం మండలం టక్కోలి నుండి యువగళం పాద యాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. రాజంపేట నియోజకవర్గంలోకి లోకేష్ అడుగు పెడుతున్న సందర్భంగా టిడిపి కుటుంబ సభ్యులు, అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, వార్డు కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, అనుబంధ విభాగాల నాయకులు, యువకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఎపి మోడల్ స్కూల్ సెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

6వ తరగతి ప్రవేశ పరీక్షపై అవగాహన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ఈ నెల 11వ తేదీన ఆదర్శ పాఠశాలో జరగబోవు ఆరవ తరగతి ఎంట్రెన్స్ పరీక్షపై పరీక్ష రాసే విద్యార్థులకు, తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరీక్ష పత్రం నిర్మాణం, ఏఏ సబ్జెక్టులో ఎన్ని ప్రశ్నలు వస్తాయి, ఒఎంఆర్ షీటు బబ్లింగుపై పిల్లలకు అవగాహన కల్పించారు. 11వ తేదీన ఉదయం 10 నుండి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, పరీక్షకేంద్రానికి ఒక గంట ముందే విద్యార్థులు చేరుకోవాలని, పరీక్షకు వచ్చే విద్యార్థులను హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేద బ్లాక్ బాల్ పాయింట్ పెన్,పరీక్ష ప్యాడ్‌తో పంపించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీనాయక్, ప్రసాద్, ఆసిఫా, సుమేయ, భారతి, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రదీప్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కలకడ

బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రదీప్

తహశీల్దార్‌గా ప్రదీప్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న రాము బదిలీపై పెద్దమండ్యంకు బదిలీపై వెళ్లారు. పీలేరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ప్రదీప్ కలకడ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విద్యార్థులకు అందుబాటులో ఉండి వారికి కావలసిన సేవలను అందిం చడం మన ముందు ఉంటానన్నారు. అనంతరం గతంలో కలకడ తహశీల్దార్‌గా నిర్వహించిన రామును సిబ్బంది పూలమాలలో దుశాల వాళ్ళతో ఘనంగా సన్మానించారు.

నేడు దుర్గంవారిపల్లెలో గడప గడపకూ...

నిమ్మనపల్లి : నిమ్మనపల్లి మండలంలో గురువారం నుంచి గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ లీలా మాధవి, ఎంపిపి నరసింహులు, వైసిపి మండల ఇన్‌ఛార్జి ఆర్ఐ రమణారెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటరత్న తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి బండ్ల పంచాయతీ దుర్గంవారిపల్లిలో మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ భాష గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

రైతు సంక్షేమానికి సిఎం పెద్దపీట

బి.కొత్తకోట : రైతన్నల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని వైసిపి నాయకులు అన్నారు. పిటిఎం మండలంలోని మద్దయ్యగారిపల్లిలో బుధవారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను రారాజులు చేసేందుకు సిఎం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఆర్‌బికెలు ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మద్దయ్యగారిపల్లి ఎంపిటిసి సయ్యద్ బాషా, సర్పంచ్ రామంజులు, కో-ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, సచివాలయం కన్వీనర్ రమణ,నాయకులు మెకానిక్ చంద్ర, ఫయాజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'మార్కెట్ ధరకే మామిడి కాయలు కొనుగోలు చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి/రైల్వేకోడూరు

తిరుపతి మార్కెట్‌లో మామిడికాయలను ఏ రేటుకు కొనుగోలు చేస్తారో రైల్వేకోడూరులోనూ అదే ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్ గిరీష పి.ఎస్ రైల్వే కోడూరు మామిడికాయల సప్లయర్స్‌ను ఆదేశించారు. రైల్వే కోడూరులో మామిడికాయలకు సరైన ధర లభించడం లేదని అసలే అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఇప్పటికే పంటను నష్టపోయిన మామిడి రైతులు మార్కెట్‌కు తరలించిన మామిడికాయలకు సప్లయర్స్ సరైన ధరను చెల్లించకపోవడంతో తీవ్రంగా నష్టపోతూ ఇబ్బందులకు గురవుతున్నారన్న విషయాన్ని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి మంగళవారం కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు కలెక్టర్ వెంటనే స్పందించి బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, జిల్లా ఉద్యాన అధికారి, మార్కెటింగ్ ఎడి, రైల్వే కోడూరు మామిడికాయల సప్లయర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులకు సరైన ధరను చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. మామిడికాయలకు తిరుపతిలో నేడు ఏ రేటు ఉంది, కోడూరులో ఎంత రేటు చెల్లిస్తున్నారని ప్రశ్నించగా తిరుపతిలో నేడు మామిడి కిలో రూ.12 ఉండగా .రైల్వే కోడూరులో కిలోకు రూ.10 చెల్లిస్తున్నట్లు అధికారులు కలెక్టరుకు వివరించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ తిరుపతి మార్కెట్‌లో చెల్లిస్తున్న విధంగానే కోడూరులో కూడా కిలో మామిడికాయలను రూ. 10 నుంచి రూ.12లకు కొనుగోలు చేయాలని మామిడి సప్లయర్స్‌ను ఆదేశించారు. ఇందుకు సప్లయర్స్ తమ అంగీకారం తెలియజేశారు. ఎవరైనా రూ.12 కంటే తక్కువ ధరను చెల్లించి రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ విషయంలో రైతులకు, మిగిలిన సప్లయర్స్‌కు రేటు పెంచిన విషయాన్ని తెలియజేయాలని ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర రాజు, మార్కెటింగ్ శాఖ ఏడీ త్యాగరాజు, రైల్వే కోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సింగిల్ విండో చైర్మన్ సుదర్శన్ రాజు, కోడూరు మార్కెట్ మామిడికాయల సప్లయర్స్ పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు : ఎంపిపి

ప్రజాశక్తి -కలకడ

మండలంలోని బాటవారిపల్లి పంచాయతీలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి శ్రీదేవి రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రతి పంచాయతీకీ ఒక రైతు భరోసా కేంద్రంను స్థాపించి తద్వారా నాణ్యమైన విత్తనాలను, ఎరువులను రైతులకు కావలసిన సలహాలు సూచనలు ఇస్తూ రైతుకి అన్ని విధాల అండగా ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రం భాగుంటుందని నమ్మిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా ఏటా రూ.13,500 ఇస్తూ, కౌలు రైతులకు దేవాదాయ భూములకు సైతం వర్తించేలా చేశారని తెలిపారు. పగటి పూట 9 గంటల ఉచిత కరెంట్, పంట దిగుబడి కోల్పోయిన రైతులకు ఉచిత పంట బీమా ఇస్తూ, వ్యవసాయ యంత్ర పరికరాలు కాని, సబ్సిడీ ఇస్తూ రైతులకు మనందరి ప్రభుత్వంతోడుగా ఉంటుందని పేర్కొన్నారు. వేరుశనగ పంటలో మంచి దిగుబడి రావాలని మనసు పూర్తిగా కోరుకుంటున్నానన్నారు. మండల వ్యవసాయ అధికారిని లావణ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రవికుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణమ్మ, వాలంటీర్స్ పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపిపి శ్రీదేవి

పారదర్శకంగా జగన్ పాలన : 'గడికోట'

ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి పాలన పారదర్శకంగా, ఆదర్శంగా సాగుతోందనిఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తూము కుంటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన కార్యక్రమం తూముకుంట కస్పా, పాపిరెడ్డిగారిపల్లె, కస్పా దళితవాడ, తూముకుంట కాలనీ, ప్రకాష్‌నగర్ కాలనీ, నాగిరెడ్డిపల్లె, మర్రికుంటపల్లె, ఆవుల వాండ్లపల్లె, కొత్తపల్లె, బలిజపల్లె, నాయునివారిపల్లె, మదార్‌సాబ్ పల్లెల్లో సాగింది. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాటాడుతూ జగన్ ప్రవేశపెట్టిన నవరత్న పథకాలతో సకల జనుల సంక్షేమం జరుగుతోందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆంధ్రప్రదేశ్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మిట్ట పల్లి యదు భూషణ్ రెడ్డి, ఎంపిటిసి షాన్వాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మండల జెసిఎస్ కన్వీనర్ ఖాదర్ మోద్దీన్(ఎస్.కె), మాజీ ఎంపిపి బండి చిన్న రెడ్డి, మైనార్టీ నాయకులు బాబా బక్రుద్దీన్, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజలకు రుణపడి ఉంటాం : పెద్దిరెడ్డి

ప్రజాశక్తి-తంబాలపల్లి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతిగా పాలన సాగిస్తున్నారని, తంబళ్లపల్లెపై ప్రత్యేక గుర్తింపు వచ్చిందని నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటామని, అభివృద్ధి ఆశయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాలకు చెందిన రైతులకు వాటర్ షెడ్ పథకం ద్వారా రూ.2 కోట్ల విలువ గల వ్యవసాయ పరికరాలు పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి ఆశయంగా పనిచేస్తానని వైయస్సార్ కుటుంబంలో తన కూడా కుటుంబ సభ్యుడిగా వ్యవహరిస్తున్నానన్నారు. నియోజకవర్గానికి ఎన్ని నిధులు కావాలన్నా అడిగిన వెంటనే సీఎం విడుదల చేయడంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోనే వాటర్ షెడ్ పథకం ద్వారా నియోజకవర్గానికి రూ.23 కోట్లు మంజూరు చేస్తారన్నారు. మొదటి విడుదల రైతులకు కావలసిన వ్యవసాయ పరికరాలు దుక్కి దున్నడం నుండి పంట మార్పిడి వరకు అవసరమయ్యే అన్ని రకాల పరికరాలు 80 శాతం సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం సబ్సిడీతో నాణ్యమైన పరికరాలు పంపిణీ చేస్తున్నారన్నారు. వ్యవసాయ రంగంలో రైతులు మరింత చొరవ చూపాలన్నారు. నియోజకవర్గంలో మారుమూల పల్లెలకు సైతం రోడ్డు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇప్పటికే ముదివేడు రిజర్వాయర్ పనులు జరుగుతుంటే ప్రతిపక్షాలకు కన్ను కుట్టి అనామిక రైతులను పావులుగా వాడుకొని పనులు అడ్డుపడడం దారుణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కాజా మైనుద్దీన్, ఇంజనీరింగ్ సురేష్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఐఎస్‌సిబిఓ మేకనాథం, వాటర్ సెట్ చైర్మన్లు, ఆర్‌బికె చైర్మన్ రెడ్డి మాల్ రెడ్డి, మల్లయ్య కొండ చైర్మన్ మర్రెడ్డి, ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎఒ రమణకుమార్, డిఒలు వెంకటరమణ, హిమబిందు, నాయకుడు సురేంద్ర, కోటిరెడ్డి, రామ్మూర్తి, జమాల్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- కలకడ

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమర్నాథ్ తెలిపారు.మండల కేంద్రమైన కలకడ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ క్విజ్ వంటి పోటీ నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు పాఠ్యాంశాల పట్టణం డ్రాయింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించిన తెలిపారు. ఈనెల 11వ తేదీన పోటీలలో గెలిపిన వారికి ప్రశంస పత్రాలు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-కలకడ

వ ృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపిపి శ్రీదేవి రవికుమార్ తెలిపారు. కె.వి పల్లి మండలం తిమ్మాపురం సమీపంలో ఉన్న కుమ్మరి పల్లె వద్ద ఉన్న వ ృద్ధాశ్రమంలో నివాసం ఉంటున్న వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించమన్నారు. కలకడ ఎంపిపి అల్లుడు బాలాజీ పుట్టినరోజు వృద్ధులకు అన్నదానం పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మనం మాట్లాడుతూ కన్నా బిడ్డలు ఉన్నప్పటికీ వ ృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు చేయూతగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు జయప్రకాష్, ఉదయ భాస్కర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎంపిపి శ్రీదేవి

పర్యావరణ పరిరక్షణపై ప్రచారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పీలేరు

పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యతని వేము ఇంజినీరింగ్ కళాశాల టీం సభ్యులు అన్నారు. వేము ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పీలేరులో పలుచోట్ల మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అని నిరూపించుకున్నారు. చిత్తూరు జిల్లా, పాకాల మండలం, పి.కొత్తకోటలోని వేము ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం పీలేరు పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణాల్లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడ్డారు. చెట్లు నరకడమే తప్ప, మొక్కలు నాటి, వాటిని పెంచి పెద్దవి చేయాలన్న కనీస జ్ఞానం, అవగాహన లేని మనలాంటి వారందరూ ఆ విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాన్ని చూసి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు ఆక్సిజన్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ తరఫున తాము ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీం సభ్యులు భువనేశ్వరి, గౌతమి, లక్ష్మీ ప్రసన్న, సుప్రియ సమీర్, సుమియా పాల్గొన్నారు.

టమోటా వ్యర్థాలను చూపిస్తున్న శ్రీనివాసులు

పేదలు నివసించే ప్రాంతాల్లో టమోటా వ్యర్థాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం బైపాస్ రోడ్డులో పేదలు నివసించే ప్రాంతాల్లో టమోటా వ్యర్థాలను డంప్ చేసి డంపింగ్ యార్డు లాగా మార్చి వేశారని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. టమోటా వ్యర్థాల వలన దుర్వాసన వెదజల్లుతోందని, ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలు అల్లాడుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు 10 నిమిషాల పాటు ఈ ప్రాంతంలో ఉండగలరా అని ప్రశ్నించారు. టమోటా వ్యర్థాలను డంప్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, డంప్ చేసిన వ్యర్థాలను తొలగించాలని డిమాండ్ చేశారు.

జ్యోతికాలనీలో కేక్ కట్ చేస్తున్న వైసిపి నాయకులు

పారిశుధ్య కార్మికులు, పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు జన్మదిన సందర్భంగా ఉప సర్పంచ్ తోట శివ సాయి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో వైసిపి శ్రేణులు కొరముట్ల జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. జ్యోతి కాలనీలో కాలనీవాసులకు వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిడి నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో కాలనీవాసులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు హేమన వర్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, ముజీబ్, కరీముల్లా, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, పట్టణ కన్వీనర్ రమేష్, ఎంపిటిసి జనార్దన్ రాజు, కొరముట్ల యూత్ సభ్యులు తొండం రాజేంద్ర, రాజ గోపాల్, సర్పంచ్ వినోద్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లను తరలిస్తున్న ఎంఇఒ, సిఆర్‌పిలు

పాఠశాలలకు జెవికె కిట్లు తరలింపు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని 63 ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం మండల స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తరలిస్తున్నట్లు ఎంఇఒ వెంకటరమణ తెలిపారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సూచించిన విధంగా మొదట గ్రామీణ ప్రాంతాల పాఠశాలకు సరఫరా కూలీలచే కిట్లను పాఠశాలలో దించి తర్వాత ఆ రూట్లో వెళ్లిన ఆయా పాఠశాల సిఆర్‌పిలు పాఠశాల హెచ్‌ఎంలకు అందజేసి రసీదు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ, సిఆర్‌పిలు హరి, ఫణి, రవి, లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, ప్రసాద్, పోలయ్య, నరసప్ప పాల్గొన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : RAJAMPETA.

I.P. No.3/2018

Y.Anjaneyulu & 13 Others. **...Petitioners**

Vs

1. Vathaluru Subba Narasamma @ Chitti, W/o Late Anjaneyulu, D.No.8/115-15, Ram Nagar, Rly Kodur Town & Mandal, Annamayya (Dist). **...Respondents**

వాది వద్ద నీవు తీసుకున్న ప్రోనోట్ బాకి నిమిత్తము పై కోర్టు నందు దావా దాఖలు చేసివున్నారు. ఇందు నిమిత్తమై మీకెలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు తేది:27.06.23న ఉదయం 10.30 గం॥లకు హాజరై ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని తెలుపుకొనగలరు. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

//By Order of the Court//

R.C.SURESH BABU
Advocate
Rly.Kodur.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.NO:144/2022

జంగా శివశంకర్ **...వాది**

వర్సెస్

గోవింద్ గోపి తండ్రి లెట్ నాగేశ్వరరావు 47 సంవత్సరాలు ఎర్రబల్లి, కోత్తబస్టాండ్ ఎదురుగ,రాజంపేట టౌన్, రాజంపేట మండలం,కడప జిల్లా, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా. **...ప్రతివాది**

దావా సమను

వాది మీపై ప్రొనోటు బాకీవసులు నిమిత్తమై పైదావను దాఖలు చేసిఉంటున్నారు మీకేమైనా ఆక్షేపణలు ఉన్నయెడల 20/06/2023 ఉదయం 10:30 గంటలకు పై కోర్టునందు మీరు హాజరై మనవి చేసుకోవలసినదిగా తప్పిన యెడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఆర్. నాగప్రసాద్
అడ్వకేట్,
రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S.No: 143 /2022

ముమ్మడి చిన్నయ్య తండ్రి లేట్ వేంకటపతి, మన్నూర్ గ్రామం మరియు పోస్ట్, రాజంపేట టౌస్ మరియు మండలం, అన్నమయ్య జిల్లా. **...వాది**

వర్సెస్

టంగుటూరు సంజయ్య మరణించి నందున ఆయన వారసురాలు టంగుటూరు లక్ష్మీదేవి, ఇంటి నెంబర్ 2/67, బోయన పల్లె గ్రామం మరియు పోస్ట్, చెన్నూర్ మండలం, కడప జిల్లా. **...ప్రతివాది**

ప్రతివాదికి నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడం ఏమనగా, పై తెలిపిన వాది, తనకు ప్రతివాది వద్ద నుండి బాండు బాపతు రావలసిన పైకమును వసూలు చేసుకొనుటకు గాను, పై కోర్టులో పై దావా దాఖలు చేసివున్నాడు. సదరు దావా పై కోర్టులో 15.06.2023 న వాయిదా వున్నది. కావున మీరు స్వయంగా కానీ లేదా న్యాయవాది ద్వారా కానీ, పై కోర్టులో 15.06.2023 న ఉదయం 10.30 గంటలకు హాజరై జవాబు దాఖలు చేసుకోవలెను. అట్లు లేని యెడల, మీ పరోక్షమందు కేసు తీర్మానించ బడును.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

ఎస్. కృష్ణ కుమార్,
ఎస్. గిరీష్ కుమార్,
న్యాయవాదులు, రాజంపేట.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి :'ముక్కా'

ప్రజాశక్తి - ఓబులవారిపల్లి

పిల్లలు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ముక్కా ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యానికి చురుకుదనానికి క్రీడలు ఎంతో అవసరమని, ప్రతి క్రీడాకారుడు ఆత్మవిశ్వాసంతో ఆత్మ రక్షణ మెలుకువలు నేర్చుకోవడంతోపాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి అలవాటు పడాలని తెలిపారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా లభిస్తుందన్నారు. క్రీడలలో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో విద్య ఉద్యోగాలలో కూడా అవకాశం మెండుగా ఉంటాయని తెలియజేశారు. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడలలో కూడా రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బ్లాక్ రెడ్ గ్రీన్ ఎల్లో బ్లూ బెల్ట్ పథకాలు మరియు సర్టిఫికెట్లతో పాటు జ్ఞాపికలు అందజేశారు. పిల్లలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమను సంప్రదిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి కృషి చేస్తానని తెలిపారు. ఇలాంటి క్రీడాకారులకు సర్టిఫికెట్ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో కోచ్ శివాజీ ప్రసాద్ భార్గవ్, డిఆర్‌యుసి బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్‌రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కారు, లారీని ఢీకొన్న పాల ట్యాంకర్

ప్రజాశక్తి-పీలేరు

ప్రమాదంలో నుజ్జయిన కారు

పాల ట్యాంకర్ కారు, లారీని ఢీకొన్న సంఘటన కెవి.పల్లి మం డలంలో చోటు చేసుకుంది. బుధవారం పీలేరు-కలకడ జాతీయ రహదారిలోని గ్యారంపల్లి పంచాయతీ, కొత్తపల్లి సమీపంలో పీలేరు వైపు వస్తున్న పాల ట్యాంకరు టైరు పగలడంతో అదుపు తప్పి అదే దిశలో పక్కనే పోతున్న ఒక కారు, లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో జమ్మలమడుగు నుంచి కారులో వేలూరుకు వెళ్తున్న ఐదుగురు ప్రయాణీకులు గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న కెవి పల్లి ఎస్ఐ లోకేష్, పోలీస్ సిబ్బంది క్షతగాత్రులని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారికి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి పంపారు.